క్లుప్తంగా

సచివాలయ సందర్శన



సచివాలయం సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ రాధిక

పూసపాటిరేగ : మండల కేంద్రంలోని సచివాలయాన్ని ఎంపీడీఓ ఎం.రాధిక మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బంది మూమెంటు రిజిష్టరును తనిఖీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం నుండి మంజూరైన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బందిని పలు ప్రశ్నలు వేశారు. ఆమెతో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్ సతీష్, సిబ్బంది యమున, హైమా తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణమూర్తి

భోగాపురం: వినాయక చవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని స్థానిక ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 18వ తేదీ నుంచి వినాయక చవితి సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు ముందుగా మైక్ పరిమిషన్ తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో ప్రైవేటు స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని, రహదారులపై అడ్డంగా ఏర్పాటు చేయరాదని అన్నారు. కమిటీ సభ్యులు తప్పనిసరిగా విగ్రహాల వద్ద ఉండాలని, పోలీసులు అడిగిన క్రమంలో అనుమతి పత్రాలు చూపాలని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగవని హామీ ఇస్తూ డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. నిమజ్జనం సమయంలో ఎటువంటి అల్లర్లు జరిగినా కమిటీ సభ్యులదే బాధ్యతని ఎస్ఐ పేర్కొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ పాపినాయుడు తదితరులు

పూసపాటిరేగ : మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని ఎంఈఓలు బి. పాపినాయుడు, రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక ఎస్వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడాపోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులు పాటు జరిగే క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. క్రీడలలో 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సమగ్రాభివృద్ధికి విద్యతో పాటు క్రీడలు ముఖ్యమే అన్నారు. క్రీడలలో రాణించి ఉన్నత స్థానంలో ఎదిగిన క్రీడాకారులును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మొదటి రోజు ఖోఖో, వాలీబాల్, టెన్నీకాయిట్, త్రోబాల్ క్రీడలు ప్రారంభమయ్యాయి. స్పోర్ట్స్ కోఆర్డినేటర్ లీలాకృష్ణ, పూసపాటిరేగ జెడ్పీ పాఠశాల హెచ్ఎం బి.శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సేవా వారోత్సవాలు

విజయనగరం: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ పిలుపు మేరకు సేవా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కందుల సంతోష్ అన్నారు. మంగళవారం స్థానిక శ్రీ పంచముఖాంజనేయ స్వామి దేవాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులను సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యదర్శి సముద్రాల నాగరాజు మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలును తమ వార్తలు ద్వారా అధికారులు దృష్టిలో పెట్టి, ఆ సమస్యలకు పరిష్కారం చూపే విధంగా ప్రయత్నించడం గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా తోటి వారికి సహాయపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ ఆలవెల్లి శేఖర్, డిమ్స్ రాజు, గుంపిన నారాయణరావు, ఏవీ కృష్ణారావు, కోశాధికారి ఏవీఎస్ కుమార్, అడ్డా నరసింగరావు, పెంటపాటి కామరాజు వాసవీ వనిత విజయం అధ్యక్షురాలు ప్రభ, వనిత క్లబ్ అధ్యక్షురాలు రమ్య పాల్గొన్నారు.

ఘనంగా ఆలా హజరత్ ఉత్సవాలు

విజయనగరం టౌన్: జిల్లా వ్యాప్తంగా సున్నీ మసీదులతో పాటూ ఉర్దూ మదరసాల్లో ఆలా హజరత్ ఉత్సవాలు సోమ, మంగళవారాల్లో ఘనంగా నిర్వహించినట్లు పట్టణ శాఖ ముస్లింల ప్రతినిధి మహమ్మద్ గౌస్ ఒక ప్రకటనలో తెలిపారు. అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు.

నేడు మండల స్థాయి స్కూల్ గేమ్స్

రాజాం సిటీ: మండలంలోని పొగిరి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. అండర్-14, అండర్-17 బాలబాలికలకు సంబంధించి, వాలీబాల్, కబడ్డీ పోటీలు ఉంటాయన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులను తీసుకురావాలని పీడీలను కోరారు.

ప్రభుత్వానికి మెండుగా ప్రజాశీస్సులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



50వ డివిజన్‌లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. నగరంలోని 50వ డివిజన్ పరిధిలోని వైఎస్సార్ నగర్ ఆటోస్టాండ్ నుండి మంగళవారం ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఆయన రాకను పురస్కరించుకుని స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లిన కోలగట్ల కుశల ప్రశ్నలు వేస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ఏ విధంగా ఉన్నాయని ప్రజా స్పందనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ వైఎస్సార్ నగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ లయా యాదవ్, కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు తోనంగి జగన్నాథరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలోని 47వ డివిజన్‌లో...

నగరంలోని 47వ డివిజన్ కంటోన్మెంట్ ప్రాంతం గంజిపేట బంగారమ్మ కోవెల నుండి ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి కోలగట్ల తమ్మన్న శెట్టి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి మంజూరు అవుతున్న ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు అర్హత ఉండి పథకాలు పొందని వారి వివరాలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి మార్గాలను చూపారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి దూబే, స్థానిక కార్పొరేటర్ పట్నాన పైడిరాజు, కొసర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువత సేవా స్ఫూర్తి ప్రశంసనీయం



సేవా కార్యక్రమాలు చేపడుతున్న యువతకు సత్కారం

విజయనగరం: నేటి యువత సేవా కార్యక్రమాలతో సమాజం పట్ల తమ వంతు బాధ్యతను నిర్వర్తించడం అభినందనీయమని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు జి.ఈశ్వర్ కౌశిక్ అన్నారు. స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో మంగళవారం విజయనగరానికి చెందిన శ్రీ పైడిమాంబ యూత్ సొసైటీ ప్రథమ వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమాజానికి ఉపయోగపడుతూనే.. మరోవైపు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకుని జీవితంలో బాగా స్థిరపడాలని సూచించారు. చిన్న వయసులోనే సేవా సంస్థను ఏర్పాటు చేసి.. అనాథలకు అన్నదానం, వైద్య, రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం, మహిళల అక్రమ రవాణాపై చైతన్యం చేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్న సొసైటీ ఫౌండర్ ప్రవల్లికను అభినందించారు. సమాజ హితం కోసం పాటుపడుతున్న వీరికి ఎటువంటి అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ సమాజంలో రీల్ హీరోలను కాక.. రియల్ హీరోలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ సంస్థల ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్న పలువురిని ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. అతిథులను నిర్వాహకులు సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో రక్తదాతలకు ఈశ్వర్ కౌశిక్ ప్రశంసా పత్రాలు అందజేశారు. సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్- 1 విజేత మనోహర్‌కు సన్మానం



గ్రూప్-1 విజేత మనోహర్‌ను సత్కరిస్తున్న పలు సంఘాల ప్రతినిధులు

విజయనగరం: గ్రూప్ - 1లో విజయం సాధించి ఆర్టీఓగా ఎంపికైన గోపిశెట్టి మనోహర్‌ను పట్టణంలోని పలు ఆర్యవైశ్య సంఘాలు మంగళవారం సన్మానించాయి. స్థానిక శ్రీ పంచముఖాంజనేయ స్వామి దేవాలయం వద్ద శ్రీ అమరజీవి ఫౌండేషన్, పట్టణంలోని ఆర్యవైశ్య సంఘాలు సంయుక్తంగా మనోహర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీ అమరజీవి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి విజయాలను సొంతం చేసుకోవాలని, జీవితంలో ఏదైనా సాధించి, మిగిలిన వారికి స్ఫూర్తిని కలిగించాలని అన్నారు. కార్యదర్శి సముద్రాల నాగరాజు, కోశాధికారి డిమ్స్ రాజు మాట్లాడారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మనోహర్ మాట్లాడుతూ మొదటిసారి సివిల్స్ రాసి ఇంటర్వ్యూ వరకు వెళ్లి తిరిగి వచ్చానని, మరింత పట్టుదలతో చదివి నేడు విజయం సాధించానని అన్నారు. మనోహర్ తల్లిదండ్రులు గోపిశెట్టి నాగేశ్వరరావు, మంజుల మరియు బలభద్రుని నానాజీ, కుసుమంచి మహేష్, వెంకట్రావు, జి.నారాయణరావు, వంకాయల దాలయ్య శెట్టి, మాచర్ల చంద్రశేఖర్ గుప్త, జి.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష



మాట్లాడుతున్న ఎంపీపీ వాసుదేవరావు

డెంకాడ: ప్రజారోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో పని చేస్తున్నారని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి ఇంటింటా వలంటీర్లు ప్రచారం చేస్తారన్నారు. 16 నుంచి ఏఎన్ఎంలు, సీహెచ్‌ఓలు తదితరులు ఆరోగ్య సర్వే చేస్తారన్నారు. దీనిలో పలు ఆరోగ్య అంశాలపై అడిగి తెలుసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం ఈ నెల 30 నుంచి ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా స్పెషలిస్ట్ డాక్టర్లు, పీహెచ్‌సీ డాక్టర్లతో వైద్య శిబిరాలను నిర్వహించి, వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. మందులను ఉచితంగా అందిస్తారని, అవసరమైన వారికి పెద్దాస్పత్రులకు పంపిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, ఎంపీడీఓ స్వరూపారాణి, ఐసీడీఎస్ అధికారులు, డాక్టర్లు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో వార్షిక ఆడిట్

నెల్లిమర్ల:



కమిషనర్ బాలాజీప్రసాద్‌తో ఆడిట్ సహాయ అధికారి ప్రభావతి

నగర పంచాయతీలో 2022 - 23 వార్షిక ఆడిట్ జరుగుతుంది. మంగళవారం సహాయ ఆడిట్ అధికారి సిహెచ్.ప్రభావతి పర్యవేక్షణలో అధికారులు ఆడిట్ జరిపారు. ఈ సందర్భంగా సహాయ ఆడిట్ అధికారి ప్రభావతి మాట్లాడుతూ గత నెల 17న నగర పంచాయతీ 2022 - 23 వార్షిక బడ్జెట్ ప్రారంభమైందని, మరికొన్ని రోజుల్లో ముగుస్తుందని పేర్కొన్నారు. తగినంత సిబ్బంది పూర్తి స్థాయిలో లేకపోవటంతో సంబంధిత ఫైల్స్ చూడటం నెమ్మదిగా సాగుతుందని, దాని వల్ల ఆడిట్ ఆలస్యమవుతుందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.45లక్షల 83వేలు 413 చెల్లింపులు, పనులు జరిపినట్లు గుర్తించామన్నారు. నగర పంచాయతీలో పన్నులు, బకాయిలు ఆశించిన స్థాయిలో వసూళ్లు జరగలేదని తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా సిబ్బంది జీతభత్యాలకు వచ్చిన ఆదాయం సరిపోవటం లేదని వివరించారు. ఆడిట్ ముగిసిన తర్వాత రెండు నెలల్లో నివేదిక అందించడం జరుగుతోందని తెలిపారు. ఈ ఆడిట్‌లో సీనియర్ ఆడిట్ అధికార్లు సిహెచ్.వెంకటసతీష్, ఎం.కిషోర్, ఎం.రమేష్ పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

సంతకవిటి:



విద్యార్థులు పరీక్షలు రాస్తుండడాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో బ్రాహ్మజీరావు

ఈ ఏడాది పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులంతా కృషి చేయాలని బొబ్బిలి డిప్యూటీ డీఈవో బ్రహ్మజీరావు అన్నారు. మంగళవారం మండలంలోని బొద్దూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు. ప్రతీ విద్యార్థి విద్యాసామర్థ్యాల మెరుగుకు సాయంత్రం పూట స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. ఆయన వెంట హెచ్ఎం మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

భరత్ చంద్రకు రాష్ట్ర స్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న భరత్ చంద్ర

విజయనగరం టౌన్: మెమొరీ విభాగంలో గాజులరేగ బసవరామ తారక కాలనీకి చెందిన కోరాడ భరత్ చంద్రకు స్టేట్ బెస్ట్ చైల్డ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అవార్డు లభించింది. ఈ మేరకు భరత్ తండ్రి రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కి చెందిన అర్పిత ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాముల యూనివర్సిటీలో ఈ నెల 11న నిర్వహించిన కార్యక్రమంలో భరత్ చంద్రకు తెలంగాణ మాజీ ఎంపీ డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి చేతుల మీదుగా అవార్డు అందజేసినట్లు తెలిపారు. 80 రకాల అంశాలపై భరత్‌ను ఇంటర్వ్యూ చేసి అవార్డు అందజేసినట్లు తెలిపారు. ఈ మేరకు కళాశాల అధ్యాపకులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



రామతీర్థంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఆంజనేయస్వామికి మంగళవారం విశేష అర్చనలు జరిపించారు. సీతారామచంద్రస్వామికి ఎదురుగా కొలువై ఉన్న ఆంజనేయ స్వామికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. స్వామిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి తమలపాకులు, సింధూరంతో అర్చనలు చేపట్టారు. అనంతరం స్వామి సన్నిధిలో హనుమాన్ చాలీసా పారాయణాలు చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు నరిసింహాచార్యులు, కిరణ్‌కుమారాచార్యులు, వర ప్రసాద్, పవన్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూముల రీసర్వే



సూచనలిస్తున్న తహసీల్దార్ రఫీజాన్

బాడంగి: పారదర్శకంగా భూముల రీసర్వే చేపట్టాలని తహసీల్దార్ రఫీజాన్ సూచించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశమైన ఆయన డీ-పట్టా భూముల్లో సకాలంలో సర్వే పూర్తి చేయాలని తెలిపారు. భూహక్కుదారులకు ఆ భూమి ఏ విధంగా సంక్రమించిందన్న విషయం కూడా రికార్డుల ఆధారంగా పరిశీలించాలన్నారు. ఓటర్ల సర్వే కూడా పక్కాగా నిర్వహించాలని, ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించి, నివేదించాలన్నారు.

వృద్ధురాలి మెడలో బంగారుతాడు చోరీ

- నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస కూడలిలో మంగళవారం కాగితాల(పిన్నింటి) బంగారమ్మ అనే వృద్ధురాలి మెడ నుంచి ఓ యువకుడు మూడు తులాల బంగారు తాడును అపహరించుకుపోయాడు. స్థానిక యువకులు అతన్ని వెంబడించి.. పట్టుకుని దేహశుద్ధి చేశారు. వివరాలివీ.. మజ్జివలస కళ్లాలకు చెందిన బాధితురాలు శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలోని బ్యాంకు బీసీ పాయింట్‌లో డ్వాక్రా డబ్బులు చెల్లించేందుకు వెళ్లింది. తిరిగి మహరాజుపేట-పద్మనాభం రహదారిపై ఒంటరిగా నడుచుకుంటూ వస్తుండగా.. వెనుకనే ద్విచక్రవాహనంపై వచ్చిన యువకుడు అమిత్‌రావు బలవంతంగా ఆమె మెడ నుంచి తాడు అపహరించుకుని వెళ్లిపోయాడు. ఇది గమనించిన రాస పోలమాంబ కూడలి వద్ద ఉన్న యువకులు తమ ద్విచక్రవాహనాలపై నిందితుడిని వెంబడించారు. మజ్జివలస ఆంజనేయస్వామి ఆలయం వద్ద చిక్కినట్టే చిక్కి వెళ్లిపోయాడు. సినీ ఫక్కీలో వెంటాడగా పద్మనాభం మండలంలోని కురపల్లి వద్ద వీరికి పట్టుబడటంతో దేహశుద్ధి చేశారు. తొలుత నిందితుడిని పద్మనాభం పోలీస్ స్టేషన్‌కు తరలించగా ఘటన భీమిలి పరిధిలో జరగడంతో అక్కడి స్టేషన్‌కు తరలించారు. నిందితుడిది విజయనగరం జిల్లా ఎస్.కోట వద్ద కొమరాం. భీమిలి పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సూచించారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోడూరు లోకేష్, తుపాకుల వెంకటరావు అనే ఇద్దరికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పిస్తూ, సంబంధిత పత్రాలను మంగళవారం ఆయన అందజేశారు. ఇద్దరికీ పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా నియమించినట్లు ఆయన తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ కె.సాంబమూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుతో చట్టాలపై మరింత గౌరవం

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుతో ప్రజలకు చట్టాలపై మరింత గౌరవం పెరిగిందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మంగళవారం మాట్లాడారు. తప్పు చేసి అడ్డంగా దొరికిపోతే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం హాస్యాస్పదమన్నారు. లోతైన దర్యాప్తు తరువాతే చంద్రబాబుపై కోర్టు చర్యలు తీసుకుందని, ఏ మాత్రం ప్రతీకార చర్య కాదని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో కోర్టు తీసుకున్న నిర్ణయం పేదలకు, సామాన్యులకు ఊరట కలిగించిందని, అవినీతితో బాధింపబడుతున్న పేదల విజయంగా దీన్ని చూడాలన్నారు. ప్రజల సొమ్మును కాజేయాలని ప్రయత్నిస్తే దర్యాప్తు సంస్థలు ఏ మాత్రం చూస్తూ ఊరుకోవన్నారు. వ్యవస్థీకృత అవినీతి కారణంగా అంతిమంగా నష్టపోయేది ప్రజలేనని, ప్రతి పైసా కూడా రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఖర్చు చేయాల్సి ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవినీతి అంతానికి కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలకు జవాబుదారీతనంతో చక్కటి పాలన అందించేందుకు ప్రభుత్వం అంకితభావంతో పని చేస్తుందన్నారు.

ముస్తాబవుతున్న గణనాథులు



అమ్మకానికి సిద్ధం చేసిన వినాయకుని విగ్రహాలు

భోగాపురం: వినాయక చవితి పండగ సందర్భంగా పూజలు అందుకోవడానికి వినాయక విగ్రహాలు సిద్ధమయ్యాయి. మండల కేంద్రంలోని భోగాపురం జాతీయ రహదారి పక్కనే విగ్రహాలు తయారీ కేంద్రం ఉంది. ఇక్కడ నుంచి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాలను కొనుగోలు చేస్తుంటారు. 2 అడుగుల నుంచి 10 అడుగుల వరకు వివిధ ఆకారాల్లో వినాయక విగ్రహాల తయారు చేస్తున్నారు. అనంతరం వాటికి రంగులు వేసి తీర్చిదిద్దాక ఆ విగ్రహాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. 15 సంవత్సరాలుగా వినాయకుని విగ్రహాలను తయారు చేస్తున్నామని విగ్రహాల తయారీదారుడైన రమేష్ తెలిపారు. తమ కుటుంబం అంతా విగ్రహాల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నామని తెలిపారు. మట్టి, సుద్ధ అధిక ధర పెట్టి కొనుగోలు చేయవలసి వస్తోందని తెలిపారు. మండలంలోని రెడ్డికంచేరు, ముంజేరు, నందిగాం, సవరవల్లి, దల్లిపేట, గూడెపువలస, సబ్బన్నపేట, రామచంద్రపేట గ్రామాలతో పాటు పాటు భోగాపురం పరిసర వాసులు కూడా ఇక్కడి నుంచే విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకువెళతారని తెలిపారు

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు



చేపల వర్తకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ లోవరాజు

విజయనగరం క్రైమ్: వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగజేస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ లోవరాజు పేర్కొన్నారు. స్థానిక దాసన్నపేట రింగురోడ్డులో చేపలు విక్రయిస్తున్న వర్తకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. రహదారి పక్కన చేపలు విక్రయాలు చేపట్టడం వలన, వాటిని కొనుగోలు చేసే కొనుగోలుదారులు వాహనాలను రహదారిమీదనే నిలిపి, చేపలు కొనుగోలు చేయడం వలన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. చేపల విక్రయదారులందరూ రహదారికి మరికొంత దూరం వెళ్లి వ్యాపారాలు చేసుకోవాలని కోరారు. చేపలు కొనుగోలుకు వచ్చే వాహనదారులు తమ వాహనాలను రహదారిపై నిలపకుండా చూడాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి, ఎవరైనా వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండగుంపాంలో కొత్త పింఛన్ల పంపిణీ



పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ పతివాడ, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక సచివాలయ పరిధిలో గుంపాం, గరికిపేట గ్రామాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ చేతుల మీదుగా నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతుందన్నారు. గతంలో లబ్ధిదారు చనిపోతే వారి స్థానంలో కొత్తవారికి పింఛన్ అందేదని, నేడు ఆ పరిస్థితి లేదన్నారు. వలంటీర్లు ద్వారా అర్హులను గుర్తించి సకాలంలో పింఛన్ మంజూరు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పతివాడ అప్పన్న, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

విజయనగరం టౌన్:



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ ఎ.శ్రీరామూర్తి, తదితరులు

మట్టి విగ్రహాలతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని, దీన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని డాక్టర్ ఎ.శ్రీరామూర్తి, డాక్టర్ బాలనాగ శ్రీకర్‌లు పేర్కొన్నారు. స్పార్క్ సొసైటీ ఆధ్వర్యంలో సాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణలో సుమారు వెయ్యి మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. ప్రజల ఆరోగ్యం కోసం, పర్యావరణ కాలుష్యం నియంత్రణ కోసం అందరూ మట్టి గణపతి విగ్రహాలు విడనాడాలని సూచించారు. ప్రతి భక్తుడు పూజించి, కాలుష్య కారక రంగు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ బొమ్మల వినియోగం చేయరాదని కోరారు. కార్యక్రమంలో పద్మనాభం, గిరి తదితరులు పాల్గొన్నారు.